క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న సురక్ష పేలస్‌లో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు చిన్నారావు మంగళవారం తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ శిబిరంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు రక్తదానం చేసి చిన్నారులను ఆదుకోవాలన్నారు. శిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: తెల్లరేషన్ కార్డు కలిగి ఎటువంటి ఇంటి స్థలం లేని వారు ఇప్పటి వరకు ఇంటి స్థలం రాని వారు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ తెరిచారని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా వార్డులలోని సచివాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

భావనారాయణుని దర్శించిన ఎస్పీ దంపతులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్పీ బిందుమాధవ్ దంపతులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని పురాతన ప్రసిద్ధి చెందిన నారాయణ క్షేత్రంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి వారిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ దంపతులు మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఎస్పీకి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు స్వామి విశిష్టతను తెలియజేసి, గోత్రనామాలతో అర్చన చేశారు.

నాణ్యత, నమ్మకానికి కొలతలే ప్రమాణం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: వినియోగదారులకు సరుకులు, వస్తువులపై నాణ్యత, నమ్మకానికి కొలతలు ప్రమాణమని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 150వ ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తూనికలు, కొలతలను నేడు లీగల్ మెట్రాలజీగా పిలుస్తున్నారని, అన్ని కాలాలకు అందరికీ కొలతలు ఈ ఏడాది థీమ్ అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు అంతర్జాతీయ నాయకత్వ పురస్కారం

బోట్‌క్లబ్: అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పాలపర్తి సుబ్బారావుకు ఆ సంస్థ అంతర్జాతీయ నాయకత్వ పురస్కారాన్ని మంగళవారం అందించింది. బరంపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 2024–25 సంవత్సరానికి గాను ఆయన నీ పురస్కారాన్ని అందుకున్నారు. 20 ఏళ్లుగా ఆయన క్లబ్, సేవా సంస్థలు ద్వారా గ్రామీణ ప్రజలకు సేవ చేస్తున్నారు. పలు గ్రామాల అభివృద్ధికి అంతర్జాతీయ స్థాయిలో కృషి చేశారు. సుబ్బారావును అలయన్స్ ఇంటర్నేషనల్ సౌత్ ఇండియా మల్టిపుల్ వైస్ ప్రెసిడెంట్ సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి, క్లబ్ మాజీ గవర్నర్లు మీసాల మధు, యు.ప్రసాద్ తదితరులు అభినందించారు.

ముగిసిన వేసవి శిబిరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు దంపతులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏపీఎస్పీ బెటాలియన్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో 20 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. పాఠశాలలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకలో కమాండెంట్ ఎం.నాగేంద్రరావు, సుజాత దంపతులు ముఖ్యఅతిథుగా హాజరయ్యారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు గ్లాస్ పెయింటింగ్, క్లే మౌల్డింగ్, ఒరిగామి ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలను కమాండెంట్ దంపతులు విద్యార్థులకు అందించి, శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

డ్రైన్‌కు దారేదీ?

- చినుకు పడితే పొంగుతున్న మురుగు
- పిఠాపురంలో క్షీణిస్తున్న పారిశుధ్యం
- అవుట్‌లెట్లు లేక రోడ్లపై పారుతున్న నీరు
- నరకం చవి చూస్తున్న పట్టణ ప్రజలు



పిఠాపురంలో పేరుకుపోయిన చెత్త

పిఠాపురం: ఏ ప్రాంతంలోనైనా మురుగు నిల్వ ఉంటోందంటే అక్కడ కచ్చితంగా వ్యాధులకు అవకాశం ఉన్నట్టే. పంచాయతీలైనా, పట్టణాలైనా మరెక్కడైనా ఇళ్లలో ముందు పరిశుభ్రత అలవడితే సమాజం మొత్తం సహజంగా ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఈ పరిస్థితి నివారించడానికి వైద్య, ఆరోగ్య శాఖ ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ ఎక్కడా చుక్క నీరు కూడా నిల్వ ఉండకుండా, తద్వారా దోమలు వ్యాప్తి చెందకుండా, మురుగుపారుదల వ్యవస్థలు స్వచ్ఛంగా ఉండేలా కృషి చేస్తుంటుంది. అయినప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, గృహస్తులలో అవగాహన లేమితో ఎక్కడికక్కడ నీటి నిల్వలు ఎక్కువగా కనిపిస్తూ దోమల వ్యాప్తికి కారణమవుతూ రోగగ్రస్త సమాజానికి కారణమవుతున్నాయి.

మున్సిపాలిటీ లెక్కల ప్రకారం పట్టణంలో 32 మురికివాడలున్నాయి. 172 కిలోమీటర్ల నిడివిలో పక్కా డ్రెయిన్లు, 71 కిలో మీటర్ల పొడవున కచ్చా డ్రెయిన్లు పట్టణంలో ఉన్నట్టు అధికార లెక్కలు చెబుతున్నాయి. వీటికి కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. కచ్చా డ్రెయిన్ల పరిస్థితి దయనీయంగా ఉంది.

పంట కాలువలే మురుగు కాలువలు

ఏలేరు ఆయకట్టులోని శివారు భూములకు సాగు నీరు అందించే ప్రధాన చెరుకుల కాలువ పట్టణం మధ్యలో ఉంది. ఈ కాలువకు కరపవారి కాలువ, ఈదురు చేను కాలువతో పాటు పలు ఉప కాలువలున్నాయి. ప్రస్తుతం ప్రధాన చెరుకుల కాలువతో పాటు, ఉప కాలువ పట్టణంలో మురుగు కాలువలుగా మారాయి. ఈ పంట కాలువల్లో చెత్త పేరుకుపోయింది.

వర్షం వస్తే రోడ్లు జలమయం

మురుగు కాలువల్లో పూడికను తొలగించకపోవడంతో వర్షం వస్తే రోడ్లు జలమయమవుతున్నాయి. మెయిన్‌రోడ్డు లోని చర్చిసెంటర్, అంబేడ్కర్ సెంటర్, సినిమా సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో కాలువల్లోకి మురుగు, వర్షపు నీటితో బయటకు చేరి రోడ్లపైకి చేరుతోంది. శివారు ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో అక్కడి పరిస్థితి దయనీయంగా ఉంది.

తూతూ మంత్రంగా పూడికతీత

డ్రెయిన్లలో పూడికతీత పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లోని కాలువల్లోనే పూడిక తీయిస్తున్నారు. తీసిన మట్టిని అక్కడే వేస్తున్నా ఎండిన తరువాత తొలగించడం లేదు. వర్షం వస్తే తిరిగి పూడిక మట్టి కాలువల్లోకి చేరిపోతోంది.

ఇలా చేస్తే మేలు

పట్టణం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా మంజూరయ్యే నిధుల్లో మురుగు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే కాలువలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని పలువురు అంటున్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు ఎక్కువగా కేటాయిస్తున్నారు తప్ప కాలువలను నిర్మించకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి రోడ్లు పాడవుతున్నాయని ప్రజలు అంటున్నారు.

దోమల మోత

గతంలో దోమలపై అధికారులు దండయాత్ర చేస్తే ఇప్పుడు దోమలు డెంగీ యాత్ర చేస్తున్నాయి. దోమల మోతతో పిఠాపురం పట్టణంలో ప్రజలకు కంటిపై కునుకు పట్టడంలేదు. దోమలు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. దోమల విజృంభణతో డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ప్రచారానికే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా దోమల బాధ ఎక్కువైపోయింది. రాత్రి సమయాల్లో దోమల బాధ విపరీతంగా ఉంటోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

మూలకు చేరిన యంత్రాలు

దోమల నివారణకు ఉపయోగించాల్సిన ఫాగింగ్ యంత్రాలు మూలపడిపోవడం, కొత్త యంత్రాలు కొనుగోలు చేసినా వాటిని ఉపయోగించిన దాఖలాలు లేకపోవడంతో గ్రామాల్లో డ్రైన్లు మురికి కూపాలుగా మారిపోవడం వంటి సమస్యలతో మున్సిపాలిటీ, పంచాయతీలకు దోమల నివారణ సాధ్యం కావడం లేదు. ఎంతో ఆర్భాటంగా నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛభారత్ పేరుతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నా పారిశుధ్యం విషయంలో ఎటువంటి మార్పు లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతి రోజు టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతోంది. వాటిని తొలగించడానికి చర్యలు సక్రమంగా తీసుకోకపోవడంతో చాలా చోట్ల చెత్త పేరుకుపోయి డ్రైనేజీలు నిండిపోయి, దోమల ఉత్పత్తి కేంద్రాలు పెరిగిపోతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా దోమల ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. దోమల బారి నుంచి కాపాడుకోవడానికి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం అయితే చాలు ఎక్కడ చూసినా దోమల గోలే వినబడుతుందని స్థానికులు వాపోతున్నారు.



వర్షానికి చెరువుగా మారిన పిఠాపురం మెయిన్ రోడ్డు



మురుగుకూపంగా కొండప్పవీధి

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న పాలంకి నాగరాజు

పెద్దాపురం: శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏటా నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. ఆసక్తి ఉన్న ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడవం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు



ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

- సీఐటీయూ కార్యదర్శి క్రాంతికుమార్
- తహసీల్దార్ కార్యాలయం ధర్నా

పెద్దాపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను నిలువునా ముంచే లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా కార్మికులందరూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల్లోని కనీస వేతన చట్టం, పనిగంటల చట్టం, కార్మికుల సంక్షేమ చట్టాలన్నీ మారిపోయి కార్మికుల హక్కులు పూర్తిగా యాజమాన్యాల చేతిల్లోకి పోయేలా ఉన్నాయన్నారు. కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కార్మికుల హక్కుల కోసం కాకుండా యాజమాన్యాల వైపు నిలబడడం దారుణమన్నారు. కార్మికుల హక్కులు కాపాడుకోవడానికి జూలై 9న చేపట్టే సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్నేహలత, సావిత్రి, రత్నం, ఎలక్ట్రికల్స్ యూనియన్ నాయకులు చింతల సత్యన్నారాయణ, తాడిశెట్టి గంగ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు లోవకుమారి, సత్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కరక సుబ్బలక్ష్మి, గాడి సత్యవతి, సీఐటీయూ నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

పిఠాపురం: సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పిఠాపురంలో ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ప్రభుత్వ స్కీం వర్కర్లగా పనిచేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి ఆశా వర్కర్ యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి, పద్మావతి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య రీత్యా అనేక సేవలందిస్తున్న తమకు శ్రమకు తగ్గ వేతనం చెల్లించడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకుచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జులై 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాగేశ్వరరావు, వై.అక్కయమ్మ, రాజేశ్వరి, అనంత కుమారి పలువురు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి

మండల ప్రత్యేకాధికారి ఎండీ నాయకర్



తుపాన్ హెచ్చరికలపై సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి ఎండీ నాయకర్

కొత్తపల్లి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.దేవుల నాయకర్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తుపాను హెచ్చరికలపై మంగళవారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడ నుంచి కోనపాపపేట వరకూ ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి అప్రమత్తం చేయవలసిన బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేకాధికారులతో బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా తుపాను షెల్టర్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం అయితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చిన్నారావు, ఎంపీడీఓ రవికుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు రవీంద్రను పోలీసు జీపులో ఆస్పత్రికి తీసుకువచ్చిన ఎస్సై గరగారావు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం మేరకు మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన నక్కా రవీంద్ర (నాగు) కాకినాడ రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని స్వగ్రామానికి మోటారు సైకిల్‌పై వస్తున్న సమయంలో వీకే రాయపురం–ముత్యాలమ్మ ఆలయం మధ్యలో ఓ వ్యాన్ వెనుకగా అతడు వెళ్తున్నాడు. ఇంతలో వ్యాన్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో మోటారు సైకిల్ అదుపు చేయలేక దానిని ఢీకొట్టి రవీంద్ర కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో కాలికి త్రీవ గాయం అయింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై ఘటనా ప్రదేశానికి చేరుకుని క్షతగాత్రుడిని తన వాహనంలో అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని మెడికర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవిడ్ కేసులపై భయం వద్దు



డాక్టర్ రామకృష్ణ

కాకినాడ రూరల్: కోవిడ్ అంటే ఒక విధమైన భయం. కోవిడ్ – 19 ప్రపంచాన్ని వణికించింది. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు చిన్నభిన్నమయ్యాయి. మన దేశం కోవిడ్‌కు అతలాకుతమయ్యింది. మళ్లీ కోవిడ్ కేసుల మాట వినిపిస్తుండగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రికి చెందిన మెడికల్ డైరెక్టర్, డాక్టరు రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటన ద్వారా కోవిడ్‌పై అనవసర భయాందోళనలు వద్దని తెలియజేశారు. ఆస్పత్రిలో చేరవల్సిన అవసరం తక్కువ అని వివరించారు. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిందన్నారు. కేరళలో 95, తమళినాడులో 66, మహారాష్ట్రలో 56కేసులు ఉన్నాయని, ఇతర రాష్ట్రాల్లో పెద్దగా కేసులు లేవన్నారు. ఈ కేసులన్నీ జేఎన్ 1 అనే ఒమిక్రాన్ ఉప వేరియంట్ వల్ల కలుగుతున్నాయని, బీఏ 2.86 కు చెందిన వేరియంట్‌కు ఉప వర్గమన్నారు. తక్కువ జ్వరం, తుమ్ములు, జలుబు, గొంతునొప్పి, అలసట, తలనొప్పి, రుచి, వాసన కోల్పోవడం లక్షణాలని, ప్రజలు ఈ లక్షణాలు ఉన్నట్టు గుర్తిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు మాస్కులు ధరించాలన్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగస్తులు బయటకు వెళ్లడం తగ్గించుకోవాలని ప్రస్తుతానికి టీకా అవసరం ఉండకపోవచ్చన్నారు.

జిల్లాలో టీడీపీ ఉనికి కోల్పోతోంది

వర్మ మౌనంపై జనసేనను ఉద్దేశించి జ్యోతుల నవీన్

పిఠాపురం: కాకినాడ పార్లమెంటు పరిధిలో టీడీపీ ఉనికిని కోల్పోయే పరిస్థితిలో ఉందని జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ నేత జ్యోతుల నవీన్ అన్నారు. పిఠాపురంలో టీడీపీ నేత మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన టీడీపీ మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. వర్మ చాలా దుందుడుకుగా ఉండే నాయకుడని, ఆయన ఇప్పుడు చాలా మౌనంగా ఉంటున్నారన్నారు. జిల్లాలో టీడీపీ ఉనికి కోల్పోతోందని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జనసేనను ఉద్దేశించి కామెంట్స్ చేశారు. అందరు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ శ్రేణులంతా పోరాటాలకు దిగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యకర్తను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో రాచూరి స్మారక పురస్కారాలు

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ అధ్యక్షుడిగా సేవలు అందించిన రాచూరి రాఘవేంద్ర స్వామి పేరిట ఏటా స్మారక పురస్కారాలను అందిస్తామని సమాఖ్య కార్యదర్శి కందాళం నరసింహారావు ప్రకటించారు. ఆంధ్ర మధ్వ సమాఖ్య, కాకినాడ మధ్వసభ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. స్థానిక మధ్వసభలో రాచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్మారక సత్కార కార్యక్రమాన్ని ఏటా ఆయన వర్ధంతి రోజున పండితులను సత్కరించి అవార్డు అందిస్తామన్నారు. ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీతో పాటు అందరి పీఠాధిపతులతో సన్నిహితంగా మెలిగిన అతి కొద్ది మందిలో రాచూరి ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో సుధా పండితులు విజయ సింహాచార్, రఘోత్తమాచార్, రఘు ప్రేమాచార్, సుమంత్ ఆచార్ పాటిల్‌తో పాటు కమిటీ ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కోశాధికారి వేముగంటి రామ నరసింహారావు పాల్గొన్నారు.

విలువల సెలవులివి!

- ఆటపాటలూ.. చదువులు..
- గ్రంథాలయాల బాట పట్టిన చిన్నారులు
- విశేష ఆదరణ పొందుతున్న శిబిరాలు




వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: ఒకప్పుడు వేసవి సెలవులంటే పూర్తిగా క్రీడలకు మాత్రమే కేటాయించేవారు. కానీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో గ్రంథాలయాలకు కొత్త కళ తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలకు కోట్లు వెచ్చించి పుస్తకాలు కొనుగోలు చేశారు. వీటిని అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయగా నగరంలోని ప్రధాన గ్రంథాలయంతో పాటు మూడు ఉప గ్రంథాలయాలకు, ఎనిమిది పుస్తక నిక్షిప్త కేంద్రాలకు సరఫరా చేశారు. ప్రధాన గ్రంథాలయంలో 1800, గాంధీగనగర్ బ్రాంచ్‌కు 1820, జగన్నాథపురం శాఖకు 600, ఆనందభారతి గ్రౌండ్ శాఖకు 600 పుస్తకాలు ఉంచారు. కొత్తగా వచ్చిన పుస్తకాలు చిన్నారులు, విద్యార్థులను కట్టిపడేస్తున్నాయి. చిన్నారులు, పలువురు విద్యార్థులు సమీపంలో ఉండే గ్రంథాలయానికి వచ్చి దాదాపు అర గంట నుంచి గంట సేపు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నారు. కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథల పుస్తకాలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, పాలిటెక్నిక్, ఎంసెట్, లాసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఆధ్యాత్మికం, వినోదం పంచే పుస్తకాలు

జూన్ 6 వరకూ శిబిరాలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్, ప్రభుత్వ అదేశాల మేరకు గత నెల 28వ తేదీ నుంచి నిర్వహణకు ఏర్పాట్లు చేసి ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా కాకుండా వారిలో పఠనాసక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రొత్సహించ డం, విద్యార్థులను ఆకట్టుకునేలా వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జూన్ 8వ తేదీ వరకూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ నిర్వహించనున్నారు. వివిధ సంస్థలకు చెందిన నిపుణులు తరగతులు బోధిస్తున్నారు.

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. పుస్తక పఠనం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్నవారికి చెస్, క్యారెమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు. నృత్యం, పప్పెట్ల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, డ్రాయింగ్, తెలుగు పండితుల నుంచి మంచి ప్రతిభ ఉన్నవారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు రావాలని కోరుతున్నారు.



నీటి ఆవశ్యకతను వివరిస్తూ గీసిన చిత్రం



కార్టూన్ డ్రాయింగ్‌పై శిక్షణ

ఆసక్తి గల అంశాలపై శిక్షణ



"చిన్నారులకు ఆసక్తి గల అంశాలపై శిక్షణ ఇస్తున్నాం చిత్రలేఖనం, వృత్తి శిక్షణ చేసిన వారు గ్రంథాలయాల్లో విద్యార్థులకు సమయం కేటాయించేందుకు ముందుకు రావాలి. పాఠశాలల నుంచి విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించి శిక్షణ శిబిరాలకు వచ్చేలా సమాచారం అందజేస్తున్నాం."

కె.కిశోర్, డిప్యూటీ లైబ్రేరియన్, జిల్లా గ్రంథాలయం